


# గుణాంతరం

– నవులూరి వెంకటేశ్వరరావు

### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### బహుమతి పొందిన ఉత్తమ నవల
### (గత సంచిక తరువాయి)

"**రాయుడిగాడికి** పరిమితమైతే రంగా గాడు చంపుతాడేమో అన్న భయం ప్రేమలతకుందని, ఆ కారణం వలన హృదయంలోనూ, శరీరంలోనూ ఇద్దరికీ చోటు కలిపించి బతుకుతోందని నీ నోట విన్నట్టు జ్ఞాపకం – పదాలు వేరు కావచ్చుగాని. ఒప్పుకుంటా కాసేపు; ఇద్దరినీ సమానంగా ప్రేమిస్తోందని. ఆమెలాగే నీవు నీ విశాల హృదయాన్ని చాటుకోవలసిన అవసరం లేదా? ఆమెకు మొదట ప్రేమపాత్రుడైన వ్యక్తిజోలికి వెళ్లకుండా ఉండలేవా? ఇన్నేళ్లు కాపురం చేసిన నేను ఆమె మనస్తత్వాన్ని గ్రహించినదానికన్నా నిన్నగాకమొన్న చేరువైన నీకు బాగా తెలుసా?"

"నేను సూక్ష్మ గ్రాహిని. నీకు పదేళ్లు పట్టిన విషయం నాకు సంవత్సరంలో గ్రాహ్యం అవుతుంది. దేనికి నేను ఎత్తుగడ వేస్తున్నానని మీ అభిప్రాయం? అలాంటివి నాకవసరం లేదె."

"చావబోయేవాడికి ఎత్తుగడతో పనిలేదన్నమాట!"

"మీకు ఒక రహస్యం చెప్పబోతున్నా, నమ్ముతారా?"

"నిన్ను గుడ్డిగా నమ్మే కదా నా సంసారాన్ని చట్టబండలు చేసుకుంది? ఇంకా నమ్మాలా?"

"వినండి అలా దూరంగావుండే. ఆమెను నేను ప్రేమించడం లేదు. సముద్రం మీద ఆన. ఈ విషయం సుమతి గారికి చెప్పొద్దు. బాధపడుతుంది. ఉరేసుకున్న ఆశ్చర్యపడక్కరలేదు."

"అబద్ధాలకోరువి. నీవు ఒట్టుపెట్టినా రేపు ఆ ఒట్టు తీసి గట్టు మీద పెట్టా అనేయగలవు. అలా అనకుండా నీవు సంబంధాన్ని కొనసాగించినా సముద్రం కూడా నిన్నేమీ చెయ్యలేదు."

"మీలాగా, నేను మిమ్మల్ని ప్రేమించడం లేదు అని సుమతి గారికి సముద్రం మీద ఒట్టేసి చెప్పినా నమ్మదు. ఆమెకు నా మీద గాఢమైనప్రేమే కాక, అంతటి గాఢమైన నమ్మకం కూడా. ఆ రెండూ ఆమె బలమైన బలహీనతలు. ఒక్కోసారి అది

నన్ను భయపెడుతుంది; నాకే ఏ చేటుకు అది దారితీస్తుందో అని. పద్మవ్యూహంలోకి వెళ్ళవచ్చు; ప్రధాన సమస్య ఎలా బైటపడటం అన్నది."

"ఆమెంటే నీకు ప్రేమ లేకపోతె నాకు జరిగే ఉపకార ఏమీ లేదు; అపకారం అనుకుంటే అది ఆమె తనకు జరిగింది అనుకునేది. నువ్వు ప్రేమించడం తెలిసిన వ్యక్తివి కాదని సాటి పురుషుడినైనా నాకు తెలుసు. పోనీ ఇలా అంటాను: కేవలం ధనాన్ని మాత్రమే నీవు ప్రేమించగలవు."

"నిజం!"

అనంతం అనుకోనిది జరిగింది ఉన్నట్టుండి. కృపా ఒంగి అనంతం రెండు పాదాలూ పట్టుకున్నాడు.

"సముద్రానికి చెలియలికట్ట ఉంటుంది, కృపా గారు. మైదానానికి అడ్డుండదు. మీ భావోద్రేకం కట్టను తెంచుకుంది. అది మిమ్మల్ని మాత్రమే ముంచదు. మీ ఆవిడ శమంతకమణి. అది శ్రీకృష్ణుడి దగ్గిర ఉంటే ఎక్కువ రాణిస్తుంది. అది ఆలశ్యంగా ఎరిగి సత్రజిత్ తన పిల్లతో బాటు దానిని కృష్ణుడికి కానుకగా ఇచ్చాడు."

అనంతం నవ్వుతూ తన కాళ్ళను వెనక్కు లాక్కోడానికి ప్రయత్నించాడు. కృపా ఉడుములా పట్టాడు. తనను చెరిచిన మొసలి గుర్తుకొచ్చింది అనంతానికి. ఆ మొసలి మేలు చేసింది. వీడూ తనకు పరోక్షంగా ఎంతో ఉపయోగపడ్డాడు. వీడి అవసరం తొలగిపోయింది. బలమంతా తెచ్చుకుని రెండు కాళ్లతో తన్నాడు. కృపా వెనక్కుపడి, వెంటనే లేచి రెండు చేతులలో మొహాన్ని దాచుకుని (అక్కడ చూడటానికి మూడో కంటివాడు లేక పోయినా), వెక్కివెక్కి ఏడవటం కొనసాగించాడు. పెదవులకు ఉప్పగా తగిలాయి కన్నీళ్లు. కన్నీరు చేదుగా ఎందుకుండదో? కన్నీరు పురుషుడికీ ఉంటుంది. పక్కనే కన్నీటి సముద్రం. ఆ నీరూ ఉప్పగానే ఉంటుంది.

"చూడండి కృపారావు గారూ, అలా ఏడుస్తారేంటి? అదీ ఒక స్త్రీ గురించీ? గతంలో మిమ్మల్ని మందలించాను. నాకు ఇంచుమించుగా ఆ మాటలు గుర్తున్నాయి. తెగింపుండాలయ్యా! మనం మొగవాళ్ళం. మనం ఏడవటమేమిటీ? స్త్రీలు ఏడవాలి; మనం స్త్రీలను ఏడిపించాలి. పురుషత్వం అంటే ఏమిటి? కేవలం పురుష అంగాన్ని కలిగి ఉండటమేనా? దున్నపోతుకు, మగ గాడిదకు కూడా ఉంటుందది; అదీ ఇదీ అననేలా? ప్రతి మగ జంతువుకు మనలాగో, మనకంటే పుష్కలంగానో ఉంటుంది. స్త్రీలను మనం మనచెప్పుచేతల్లో ఉంచుకోవాలి; ఏడిస్తే మగ జాతి పరువు తీసినవాళ్ళం అవుతాము. జాతికి వన్నె తెచ్చే పని చెయ్యాలోయ్! టెస్టోస్టెరాన్ ప్రకృతి మనకు కానుకగా ఇచ్చింది. మనకు బాహుబలంలో పైచేయి నిచ్చింది. మనం స్త్రీలను బలవంతం చేయగలము గాని, వాళ్ళు మనలను ఆ పని చెయ్యలేరు. మనం చేస్తే వాళ్ళు విచారిస్తారు. వాళ్ళు మనల్ని చేస్తే మనం ఆనందిస్తాం. సృష్టిచేసే చేసే పనులకు మనం ఎదురీదలేము; కొట్టుకుపోవడమే తప్ప. విశ్వామిత్రుడు కూడా ప్రతిసృష్టి అతి స్వల్పంగా మాత్రమే చెయ్యగలిగాడు; భంగపడ్డాడు; త్రిశంకునూ అభాసుపాలు చేశాడు. మగాళ్ళం! (ఈ మధ్య మృగాళ్ళం అని ఒక చవాలాయి కొత్తపదాన్ని కనిపెట్టినట్టున్నాడు; వాడి నాన్న మృగమేమో మరి!) మనది సృష్ట్యాది నుంచీ పై చేయి. చరిత్రహీనుడిగా

మిగిలిపోదలచారా? పక్కనే సముద్రమున్నామీరు నా పాదాలు మీ కన్నీటితో కడిగారని తెలిస్తే సుమతి మిమ్మల్ని దగ్గిరికి రానిస్తుందా? ఏడిచే ఆడదాన్ని నమ్మచ్చు కానీ ఏడిచే మగవాడిని నమ్మకూడదు అన్నది మన సంప్రదాయ నమ్మకం. సంప్రదాయాన్ని బూజుతో పోల్చడం అహంభావమవుతుంది. నవ్వే ఆడదానితో మనం జాగ్రత్తగా ఉండాలి కానీ ఉండం; మనలను ఆహ్వానిస్తోందా అన్న సందేహంలో పడతాము. సీతను రాముడు శీలపరీక్షచేశాడుగాని, సీత రాముడి శీలాన్ని పరీక్షకు పెట్టలేదు ఆయన సంవత్సరకాలమో అంతకన్నా ఎక్కువో అడవుల్లో అడ్డదిడ్డంగా తిరిగినా. చిత్రరథుడు అన్నవాడు తన భార్యలతో జలక్రీడలు ఆడుతుంటే రేణుకాదేవి మానసిక వ్యభిచారానికి పాల్పడింది. మునిని చూస్తూ వచ్చిన కంటితో రాజును చూడకూడదు. ఎదురైతే కన్ను మూసెయ్యాలి. ఆలోచనను కూడా పుస్తకంలా చదవగలిగిన జమదగ్ని మహర్షి ఆమె తలను ఆమె తనయుడి చేతే తీయించాడు. ఇద్దరితో తిరిగిన సుమతిగారి గురించీ భోరుభోరున ఏడుస్తున్నారు కృపారావు గారు! మీరు సమస్య అనుకుంటున్నదానికి సులువైన పరిష్కాముంది."

" సీత, రేణుక కల్పితాలో ఒకనాటి నిజ జీవితంలోని వ్యక్తులో దేముడికి తెలియాలి; నాకు తెలుసు అని నీవంటే నేను నమ్మను. ఎవడో చేయనిపని, లేక చేసినపని నేను అనుకరించాలి, అనుకరించకూడదు అని లేదు. నా జబ్బుకు తగిన మందును నేను వేసుకుంటాను. అది వికటిస్తే నా చావు నేను చస్తాను. నీకు అవన్నీ అనవసరం. నిన్నుపిలిచింది నీ ప్రవచనం వినడానికి కాదు; తా'డోపేడో తేల్చుకోడానికి. నువ్వు చెప్పబొయ్యే పరిష్కారం ఏమిటో నాకు తెలుసు. కాగితాలతో దానికి పరిష్కారం దొరుకుతుంది; కన్నీరేలా? అంటావు. నీలా పెద్ద ఉపన్యాసాన్ని నేనూ ఇవ్వగలను భావోద్రేకం అడ్డుతగలకపోతే. విడాకులకూ తమలపాకులకూ నేను సిద్ధంగా లేను. హృదయ సంబంధమైన విషయాలు ఆ అంగం కలవారికి మాత్రమే తెలుస్తాయి. ఆమేను ఒదిలెయ్య దలచుకుంటే రాయుడితో ఆమె తిరిగినపుడే ఒదిలేసేవాడిని. ఆమెను గతం గతః అనుకుని స్వీకరిస్తాను నీవు దయచేసి వైదొలగితే. వాయిదావేస్తూ వస్తున్నా సంతానాన్ని కని సుఖంగా ఉంటాము."

"బాధలో ఉన్నా మంచి సమాధానమే ఇచ్చారుగానీ; ఆమెను మీరు 'స్వీకరించడం' ఏమిటండి. ఆమె మిమ్మలను స్వీకరించాలి."

"భాష నీకుమాత్రమే తెలుసని విర్రవీగకు. ఇప్పుడు తప్పు ఆమె చేసిందా, నేను చేశానా? తప్పు నేను చేసుంటే – క్షమించడం, క్షమించకపోవడం; స్వీకరించడం, స్వీకరించకపోవడం ఆమె చేస్తుంది."

"ఆమె చేస్తున్నదాని, మీరు తప్పుగా భావిస్తున్న దానినిని పట్టించుకోకుండా ఉంటే ఈ ఆవేదన, సముద్రపు గాలిలో యాతనపడటం, కన్నీరు పెట్టుకోడం ఉండవు. ఆమె నాతో గడపడం ఆమెకు ఆనందాన్ని కలిగిస్తుంది. మీ స్వార్థ చింతనతో ఆమెకు ఆ ఆనందాన్ని కాకుండా చేయాలని చూస్తున్నారన్న విషయం మీ బాధ కారణంగా గ్రహిస్తున్నట్టులేదు. త్యాగధనుడిగా మారండి."

"నీవు ఏ పుటకపుట్టావో నాకు అర్థం కావడం లేదు."

"అది మీకు అంత అవసరమా? రాజ్యాన్ని ఏలుతూ కూడా విరాగిగా ఉండగలిగాడట కదా జనకుడు? మీకేమన్నా తెలుసా? అది తెలిసుంటే మీకు ఉపయోగపడకపోదు. భవిష్యత్తులో మంచి జరగకపోదు అన్న ఆశాభావంతో ఉండండి. దేనికైనా చచ్చేంతవరకూ ఓపిక పట్టాలి; చచ్చినతర్వాత ఓపిక పట్టాలిసిన అవసరం ఉండదు. పెళ్లీపెటాకులూ లేని భీష్మపితామహుడు  మహావీరుడు, గంగాపుత్రుడే తన మరణం గురించీ ఉత్తరాయణం వరకు బాధను సహిస్తూ ఓపికపడ్డాడు. ఆయన కేశానికి పోలం మీరూ నేనూ కూడా."

"నీ భార్యను నేను లొంగదీసుకుంటే ఇంత నిబ్బరంగా ఉండగలవో, లేదో చూడాలనుంది నాకు అంతవరకూ బతికుండాలేగాని."

"మీది పనికిమాలిన కోర్కె. భార్య అవసరం లేనివాడికి పెళ్లేమిటి? మీది నెరవేరని కోర్కెగా మిగిలిపోవచ్చు; ఈ బాధను తట్టుకుని మీరు బతికి బట్టకట్టడం అంత సులువు కాదేమోనని నాకనిపిస్తుండటం వలన. పైగా సుమతి గారు మీకు విడాకులిచ్చి నన్నుపెళ్లాడాలని నిశ్చయించుకోకూడదనుందా?"

"నీ పెళ్లి ఎప్పుడో నీకు తెలియకపోవచ్చుగాని. నీ చావు మాత్రం కొన్ని రోజులలోనేవుంది; ఏమో ఈక్షణాన్నే అది జరగవచ్చు."

"మీ భార్య నన్ను తన జీవితం నుంచీ వైదొలగిపో అన్నమరుక్షణం నేను ఆమెను ఒదిలేసిపోతా. చూరుపట్టుకు ఊగులాడే మనస్తత్వం కాదు నాది."

"అనంతం గారూ, మాది ప్రేమ వివాహం. నేను ఒకప్పుడు పేదవాడిని. అందుచేతా ఆమె తండ్రి మా సంబంధానికి ఒప్పుకోలేదు. ఆమె బావిలో దూకింది. అక్కడున్నవాళ్ళు రక్షించారు. అంటే ఏమిటి? ఆమె ప్రాణాన్ని తృణప్రాయంగా నా గురించీ భావించింది. ఆమెలోని మార్పులు నన్ను ఆశ్చర్యచకితుడిని చేస్తున్నాయి. మనిషి మనసు చంచలమైనదని నాకు కాస్త తెలుసు; అది వాతూలంలా ఇంత చంచలమైనదని ఇప్పుడు తెలుస్తోంది. మీ కాళ్ళు కడిగాను. మీ చేతులు కూడా కడగ గలను. చాలినంత కన్నీరుంది. నా భార్యను నాకు త్యాగంచేయ్యండి. పుట్టబొయ్యేది ఆడబిడ్డయినా, మగబిడ్డయినా మీ పేరు పెట్టుకుంటా."

"నేనుఆమెను వదిలేసిన మరుక్షణం ఆమె చస్తే? మీకూ నాకూ కూడా దక్కదు."

"ఆమె చచ్చిన మరుక్షణం నేనూ చస్తా."

"మరి మీ బిడ్డకు నా పేరు ఎలా పెట్టుకునేట్టు? నాకు ఇప్పుడు అనిపిస్తోంది. నేను మన్మథరూపంతో పుట్టడం లోకానికి చేటుగా పరిణమించిందేమోనని. దేవుడు కురూపిగా పుట్టడానికి గాని, నేను అందగాడుగా అవతరించడానికి గాని మా తల్లిదండ్రులకు గాని మాకుగాని ప్రమేయం లేదు. జనాన్ని ఆకర్షితులు గాకండి అని నేను అనలేను. నా మెడకు ఒక లోహపు రేకు బిళ్లలాంటిది వేలాడేసుకుని తిరగలేను. అలా వేసుకున్నా ఆకర్శించబడకుండా అది ఆపలేదు. నా అదృష్టం కొద్దీ నేను నా అందాన్ని చూసి నాతో నేను ప్రేమలో పడలేదు. నార్సిస్సస్ లా శాంతిలేకుండా బతికి, క్షీణించి

కుక్కచావు చావాలిసి వచ్చేది. ఈ సృష్టిలో దేనికీ కారణాలు కనుగొనలేము. అదీ మన మంచికే కావచ్చు. అది పనికిరాని పరిజ్ఞానంగా భావించబడిందేమో!"

"అగ్నిసాక్షిగా వివాహాలు జరుగుతాయి. అగ్ని ఎక్కడికీ, న్యాయస్థానంలో బోనులోకి కూడా వచ్చిసాక్ష్యం చెప్పదు లేక చెప్పదు – న్యాయస్థానాలు రానివ్వవు. ఒక వ్యవస్థ లోపభూయిష్టమైనదైనా ఉండటం అవసరం, సమాజాలు రక్తసిక్తమ్ కాకుండా నడవాలంటే. వివాహవ్యవస్థను చీదరించుకోడంకన్నా, దానికి మెరుగైన మరొక వ్యవస్థేమిటో మనం కనుగొని ఏర్పాటు చేసుకోవాలి. సహజీవనాలు కలకాలం సాగవు. ఇద్దరు మనుషులు ఒక కొంపలో జీవిస్తున్నపుడు కలతలూ కలహాలూ తప్పవు. వంద పెళ్ళిళ్ళలో సర్దుబాట్లతో సాగుతున్నవి ఎక్కువే; కూలిపోయే వాటి సంఖ్యా కన్నా. సర్దుకుపోవడం మంత్రం. ఒకరినొకరు శిఖ విడిపోయేట్టు, గొంతులు పొడిబారేట్టు లేక చిరిగేట్లు; చేతులు ఒకరిమీదికి మరొకరు చాచుకుంటూ ప్రశ్నించుకోడం కాదు."

"ఎవరి వాదన వాళ్ళకుంటుంది. ఎవరు ఎలా చద్దామనుకుంటే అలా చచ్చే స్వేచ్ఛ గలదు. అది అక్షారాలా చావు కాదని గ్రహించగలరు. పోదాం పదండి. విధి ఎలా నిర్ణయిస్తే అలా జరుగుతుంది అని నా అభిప్రాయం. విధి అన్న పదం వాడటానికి అభ్యంతరముంటే దానికి మరో నామకరణం చేసుకోవచ్చు. కత్తితో నన్నుపొడిచే ప్రయత్నం చెయ్యకండి. ఇద్దరం సమాన బలవంతులం. నేను తప్పించుకోడంలో ఆ కత్తి మీ గుండెల్లో దిగదన్న గారంటీ లేదు. కత్తికి నేనన్నా, మీరన్నా ఒహటే. భల్లూకం లాంటి రాయుడిచేతే నీరుడు పోయించాను."

"నువ్వెళ్లు; నేను నీతో రావడం ఎందుకు? రావాలా, పోవాలా అన్నది నేను నిర్ణయించుకుంటా. గో టు హెల్! నరకానికి పో!"

తప్పు లేక పాపం అని మనం భావించదలచుకున్న వాటిలో (అలా భావించుకోవాలని ఏ కారణాల వలన నిర్ణయించుకున్నామో తెలియదు) అనివార్యమైనా ఆకర్షణ ఉన్నట్టుంది. నిషేధించబడిన వాటిమీద ప్రత్యేకమైన ఆకర్షణ మనిషికి ఉంటుంది; మనస్తత్వలోపమో, లోపం క్రింద పరిగణించక్కరలేదో! కట్టేసిన చెయ్యి బంధాన్ని తెంపుకోవాలని, మూసేసిన కన్ను తెరుచుకోవాలని, చెవులను మూసి ఉంచిన చేతులను తొలగించుకోవాలని చూస్తాము. మనసూ, శరీరం స్వేచ్ఛకు అనుగుణంగా ఏర్పడుంటాయి. ఒక మనిషి సౌందర్యాన్ని చూసి మరొక మనిషి నిగ్రహించుకోవడం సామాన్యమైన విషయం కాదు స్త్రీ పురుషులు పరస్పరంగా. స్త్రీ పురుషుల మధ్య ఉండే పరస్పరాకర్షణ నీతి నియమాలకు తట్టుకుని మనగలగడం అగ్నిపరీక్షకు లోనయి బతికి బట్టకట్టడం. దానికి సంకెలగా భయం తోడ్పడుతుంది. వివాహానంతరం స్త్రీ పురుషుల మధ్య యాజమాన్య సంబంధ స్వార్థం చోటుచేసుకుంటుంది. కుటుంబ గౌరవానికి, స్త్రీ నడవడికీ ముడిపెట్టబడి ఉంది; ఇది ఈనాటిది కాదు. దాన్ని స్త్రీని ఒక వస్తువుగా లేక ఆస్తిగా భావించడం అని తేలిగ్గా తోసిపారెయ్యలేము. స్త్రీకి ఆపాదించే గౌరవంగా కూడా దాన్నిచూడటం వలన అలా జరిగుండొచ్చు. అనంతం సౌందర్యానికి బానిసగా మారింది సుమతి. అనంతం హృదయాన్ని చూసి అతనితో చెయ్యికలిపిలింది అనడానికి అతని హృదయం మనసు ఉన్నతమైనవి

కాదు గదా. కృపలో ఆమె భరించలేని అంశాలు లేవు; ఆమె ఎంత అణకువగా ఉండమంటే అంత అణకువగా ఉండటానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండే వ్యక్తి అతను.

ఆయనెవరో అన్నారు మంట సృష్టిలోకల్లా అందమైనదనో, ఆకర్షణీయమైనదనో. దాంట్లోకి దూకి సౌందర్యప్రియుడు చావడంలేదు; చూసి ఆనందించడానికి పరిమితమయ్యాడు. దీపం పురుగులు సౌందర్యాన్ని శారీరకంగా అనుభవించి, చచ్చి తరిద్దామనుకుంటాయో; ఆహారంగా దానిని భావిస్తాయో. సాటి పురుగులు చావడం చూస్తున్నా అవి వెనుకకు మరలవు. వాటి చావుకు అగ్నిని నిందించడం అవివేకం. జ్ఞానం, మనసు, శరీరం ఉన్న మనుషులను అగ్నితో పోల్చలేము. మనిషి ఆకర్షించే స్త్రీ లేక పురుష సౌందర్యాన్ని లైంగికంగా అనుభవించాలని కోరుకుంటాడు. అమలిన శృంగారం కవితలకు, కావ్యాలకూ, ప్లేటోకూ పరిమితం. ఆ సౌందర్యానుభవం మరొకరికి పంచి ఇవ్వలేదు. చూసి తట్టుకోలేని సౌందర్యం మూడో వ్యక్తికీ సమస్యగా పరిణమిస్తుంటుంది.

అనంతం సుందరుడు; మరి సుమతి రాయుడికీ ఎందుకు లొంగిపోయింది? ఆమె కంటికి రాయుడులో ఏదో ఆకర్షణ, జాలి అని పిలవ కూడని జాలి, తనను హింసించిన వ్యక్తిపై కలిగిన అసహజ ప్రేమ కారణాలు. అది రాయుడికి సంబంధించినంత వరకూ ప్రేమకు చోటులేని కేవలం లైంగిక వాంఛ. అనంతం అందమైన పురుషుడికి ఆఖరి ఉదాహరణ కాదు. అతనిని మించిన సౌందర్యవంతుడు ఆమె జీవితంలో తారసపడితే అనంతాన్ని ఒదిలేస్తుందేమో వాడు ఆమె చేతికై తీవ్రంగా ప్రయత్నిస్తే! కోర్కెకు స్వేచ్ఛ ఉండకపోవడం మంచిది. దాన్ని అదుపులో ఉంచునే లేక అణచుకునే ప్రయత్నం జరగాలి. అది చెయ్యని వ్యక్తుంటాడా? కాలు జారడం, జారకపోవడం అవకాశం మీద కూడా ఆధారపడుంది. మనిషి సహజ దౌర్బల్యం ముందు ఆదర్శం, నైతికత బలహీనమైనవి. సామాజిక జీవితానికి నీవు భాగస్వామివి ఐన తరువాత ఆ జీవితానికి అవసరమైన, వాటంతట అవి లేక మనుషుల ప్రమేయంతో కాలక్రమేణా ఏర్పడ్డ సూత్రాలకు లొంగాలి. లొంగలేకపోవడమూ ఉంది; పర్యావసానాలూ ఉన్నాయి ఒక పురుషుడు, స్త్రీ లైంగికంగా కలవడమనే రెండు శారీరక, మానసిక, హృదయ రహస్యాలను ఒకరికొకరు తెలుపుకున్నట్టు కూడా. ఆ రహస్యాన్ని కేవలం ఒకరితో మాత్రమే పంచుకుంటా అని భావించే వ్యక్తులకు కొరత లేదు.

కృపా తనను కలిసి ప్రాధేయపడిన తరువాత ఏమి జరిగిందో తెలుసుకోవాలన్న ఉత్సుకతను ఆపుకోలేక రెండు సార్లు ఫోను చేశాడుఅనంతం. ఆమె తీయలేదు. ఆమె ఇంటికెళితే కృపా ఉండటం తటస్థించి ఇబ్బందిపాలవ్వొచ్చు తాను. చివరకు ఉత్సుకత తెగింపు తెచ్చి అతన్ని సుమతి ఇంటికి చేర్చింది. ఆమె మొహం గండుపిల్లి మొహంలా ఉంది, ఉబ్బి. అతన్ని చూడంగానే ఆమె కళ్ళు వర్షించాయి.

“నా సంసారం కూలింది, అనంతం.”

ఆశ్చర్యాన్ని నటించాడు. నోట మాట రానట్టు కొన్ని క్షణాలు మాట్లాడలేదు. తల వాల్చేశాడు దానికి పట్టు తప్పినట్టు.

"మనసంగతి తెలిసిపోయింది. నిన్న సముద్రం ఒడ్డున మాటేసి నాతో గొడవపడ్డారు. చేతిలో కత్తి కూడా ఉంది. దాంతో నన్ను బెదిరించాలని చూశారు, నేను సంయమనం పాటించాను. అతనికి హాని జరిగినా, నాకు జరిగినా నీవు ఓర్చుకోలేవు?"

"అది తెలియకుండా ఉంటుందని నీవు ఏదన్నా  కలలో అనుకున్నావా? ప్రేమికులు లేక కాముకులు అంటే ఉష్ట్రపక్షులు."

"లేదు. అలా అనుకోడం మన అవసరమని మాత్రం అనుకున్నా. నీ పై ప్రేమతో సర్దుకుపోతారు కాస్త గోలపెట్టి అనీ అనుకున్నాను. ఆత్మహత్యకు  పాల్పడరులే, అలా చేస్తే నీకు శాశ్వతంగా దూరమవుతారు కనుక. కృపకు నీ మీదనున్న ప్రేమ అతనికి అతనిపై గల ప్రేమకన్నా అధికం."

"ప్రాణప్రదంగా ప్రేమించిన భార్యను  మరో పురుషుడు అనుభవిస్తుంటే భరించగలడని, ఆత్మహత్య చేసుకోడని ఎలా సూత్రీకరించగలవు, ఎంత గుడ్డిగా ఆయన నన్ను ప్రేమించినా?"

బోరున ఏడవటం మొదలుపెట్టింది. అతను ఊరుకోపెట్టలేదు. కొన్ని క్షణాల్లో తేరుకుంది.

"అలా అనుకోడం మనకు ఊరట ఇస్తుందిగా, సుమతి? అతను దగాపడిన నీ భర్తే కాదు, ఎంతైనా నా స్నేహితుడు కూడా కదా? నిన్ను నేను కూడటం ద్వారా ఆ స్నేహితుడికి ద్రోహంచేశానన్న భావనను దూరంగా ఉంచే ప్రయత్నంలో నేను అనుభవించిన మానసిక సంఘ ర్షణను మాటలలో చెప్పలేను. ఏంచేద్దాం?"

"ఎవరికి ఫోను చేసి అడిగినా వాళ్లందరికీ ఏదో జరిగిందన్న విషయం తెలిసి పోతుంది. ఒకవేళ అతను ఈరోజో, రేపో తిరిగి వస్తే నేను హంగామా చేయడమే మిగులుతుంది, మన వ్యవహారాన్ని మరింత రట్టు చేసినట్లవుతుంది."

"నీవు ఏ సాయం చెయ్యమన్నా చేయడానికి నేను సిద్ధం. రెండు రోజులాగి పోలీసు ఫిర్యాదు ఇద్దాం. ఏమంటావు?"

తల ఊపింది. పనిమనిషి లేకుండా చూసి ఆమె పక్కన చేరి ఒళ్ళోకి తీసుకున్నాడు. ఆమెకన్నీళ్ళతో అతని పాంటు తడిపింది.

"ఒకసారి ఇద్దరం మీరు గడిపిన చోటుకు వెళ్లి చూద్దాం."

"అలాగే, సుమతి. నీవు ఏమి చేద్దామన్నా చెయ్యడానికి నేను సిద్ధం. నీ కారు తెచ్చుకో. నేను అటునుంచీ అటు నా ఆఫీసుకి వెళ్ళడానికి వీలుంటుంది."

రాత్రి ఇద్దరూ కలిసినచోటుకొచ్చాడు. రోడ్డు పక్కనే కృపా పార్కు చేసిన కారుంది. లోపలి తొంగి చూశాడు. తాళం లోపలే ఉంది. అక్కడే తన కారూ తిరిగి పార్కు చేసి ఇద్దరూ కూర్చున్న చోటుకుకు నడిచాడు. సముద్రపు ఒడ్డున చచ్చిన పీత కూడా కనబడలేదు. దానంతట అది దాక్కుని ఉంటే తప్ప సముద్రం దేన్నీ దాచుకోదు అంటారు. అది నిజమో అబద్ధమో అనంతానికి తెలియదు. సుమతి డ్రైవరుకు ఫోను చేసి మాట్లాడింది.  కృపా కారు కృపా యింటికి చేరింది. కృపా

మాత్రం చేరలేదు. సముద్రం అతన్ని దాచుకుందా? కత్తిని ఉపయోగించుండడు; నా గురించి దాన్ని తెచ్చునంటాడు అనుకున్నాడు అనంతం.

తరువాత రెండు రోజులాగి సుమతి ఎలావుందో చూడాలనిపించి గంభీరమైన ముఖకవకవళికలతో వెళ్ళాడు. ముందు కాఫీ ఇచ్చింది. అది ఎప్పటికన్నా రుచిగా తోచింది అనంతానికి. సంపదతోపాటు కాఫీ రుచి మరిగాడు. ఆమె ఏడ్చింది. అతను ఊరుకో, ఊరుకో అన్నాడు, అంతకన్నా మరొకటి అనడం, మరొకటి చెయ్యడం అతనికి చేతకాకనో, చెయ్యాలనిపించకపోవడం వలననో.

ఇతరాత్రా బాధ్యతలన్నీ భర్త భరిస్తుండగా ఆమె నుంచి అవసరమైనసుఖం, అవసరం లేనపుడు కూడా పాలలా డబ్బు పిండుకోడం తేలికైన పని. ఒంటరిస్త్రీ బాధ్యతను కాస్తో కూస్తో తన భుజాలమీద మోయడం వేరు. పైగా ఆమెతో తన మిగిలిన జీవితమంతా గడిపెయ్యడమేనా?

కృపా సముద్రపు ఒడ్డున కాళ్లావేళ్లా పడ్డప్పుడు "కృపా గారు, మీ ఆవిడను మీరు కట్టడిచేసుకుని ఉంచేసుకోండి; నేను ఆమెను కలిసే ప్రయత్నం త్రికరణ శుద్ధిగా చెయ్యను, నేను ఆమెను ఒదిలెయ్యదలచుకున్నానని ఆమెకు తెలియకుండా మీకు ఏ సహాయ సహకారాలు కావాలంటే వాటిని శక్తిమేరా ఇవ్వగలను," అనుంటే కృపా సహాయం (కాస్తో కూస్తో) ఆమెను ఒదిలించుకోడానికి ఉపయోగపడేది. అతను సముద్రంపాలయి పోయాడు కాబట్టి ఆమెకు తాను ఏకైక దిక్కు; తనను పట్టుకుని ఊగులాడుతుంది; యాగీ చేయవచ్చు కూడా. అతను ఏడుస్తుంటే వినోదంలో మునిగితేలుతుండగా తన వివేకం దెబ్బతినింది.

"కృపా గాను తిరిగి వచ్చేవరకూ మనసు దిటవుచేసుకుని జీవించడం కన్నా నీవు చేయగలిగింది ఏమీ లేదుకదా, సుమతీ? వీలైనపుడల్లా వచ్చి నిన్ను కలుస్తుంటా, వస్తా."

ఒకరోజు మధ్యాన్నపు పిడుగులా ఊడిపడ్డాడు అనంతం సుమతి ఇంటి మీద.

"అనంతం. నల్లపూసయ్యావు. నువ్వూ నన్ను ఒదిలిపోతావా?"

"సుమతీ, నువ్వు అలా మాట్లాడితే నాకు రావాలనిపించదు. వ్యాపారం నువ్వు పెట్టించింది కదా. దాన్ని రెండు కళ్ళతో కనిపెట్టుకుని ఉండాలి. తీరికుండటం లేదు. నువ్వు అనుక్షణం నాకు గుర్తుంటూనే ఉంటావు. కృపా తిరిగిరావాలని నువ్వే కాదు నేనూ ఎదురుచూస్తున్నాను."

ఆమె కళ్ళు ముచ్చెనగుంటల అడుక్కు వెళ్లిపోయాయి. వాటిలో మెరుపు వెళ్ళిప్లోయింది. మృతకళ వచ్చేసింది. ఆమె తనకన్నా కృపను అనేకరెట్లు అధికంగా ప్రేమించివుంటుంది అనుకున్నాడు అనంతం. అతనికి అసూయ కలగలేదు. సుమతి కృపా మనిషే కానీ తన మనిషి కాదు. కృపా పై ప్రేమ ఆమె మరణానికి దారి తీయదు కదా అనుకున్నాడు. తాను చెప్పదలచుకున్నది ఎలా చెప్పాలో అనంతానికి తెలియడం లేదు. గుండెను ఎంత దిటవు చేసుకోడానికి ప్రయత్నం చేసినా

సఫలీకృతం కాలేక పోతున్నాడు. ఆమె అతను ఏదో చెప్పడానికి తటపాయిస్తున్నాడన్న విషయం అతని ముఖంలోకి గుచ్చి గుచ్చి చూస్తూ గ్రహించింది. కృప గురించీ ఏదన్నా చెడ్డ వార్త తీసుకు రాలేదుకదా?

"నువ్వు ఏదన్నా చెప్పదలచుకుంటే చెప్పెయ్యి, అనంతం. నా తల రోలులో ఉంది. రోకటిపోటుకు వెరువదది."

"నీ గొంతు ఎంత బొంగురుగా ఉందొ తెలుసా?"

"పొద్దున్న తొమ్మిది దాకా మొద్దు నిద్రపోయా."

"ఆసుపత్రికి వెళదాం ఈ రోజు సిద్ధంగా ఉండు."

"నాకు శారీరక రోగం ఏమీ లేదు, అనంతం."

"ఏరోగం లేకుండానే శరీరం ఎండుపుల్లయిందా?"

“మనసూ, శరీరం వాటినవి చంపుకొని. అసలు విషయం ధైర్యంగా చెప్పు."

"చెప్పక తప్పదం లేదు, సుమతి. నేను స్వార్థపరుడిని. ఈ నేరానికి నన్ను హృదయపూర్వకంగా క్షమించు."

"క్షమించా. క్షమార్హమైన నేరం ఒక వేళ నా పట్ల చేసినా నిన్ను నేను చేయగలిగింది లేదుకదా?"

ఓపిక ఆవిరవుతోంది. సంభాషణ అతనికి విసుగు కలిగిస్తోంది. కుండబద్దలుకొట్టినట్టు చెప్పదలచుకున్న విషయం చెప్పి, 'ఇక చావు,' అందామనుకున్నంత అసహనంతో ఉన్నాడు.

ఒక శుభలేఖ తన బాగు లోనుంచీ తీసి ఆమె చేతికిచ్చాడు. కవరు మీద రాసున్నది చదివింది.

"చాలా సంతోషం, అనంతం. ఒక ఇంటివాడివవుతున్నావు; కొత్త జీవితం ఆరంభం కాబోతోందన్నమాట. శుభాకాంక్షలు."

కుడి చేయినిచ్చింది. అది తోటకూరకాడలా కనిపించింది. వేళ్ళతో అందుకున్నాడు. ఒళ్ళు జలదరించింది.

"నీ దయవలన నేను ఇంతవాడినయ్యాను. నీ ఋణం తీరేది కాదు."

"అదంతా నీ గొప్పదనమే. నేను నిమిత్తమాత్రురాలిని. నేను కాకపోతే మరో డబ్బున్న స్త్రీ నీకు పైకి రావడానికి తోడ్పడుతుంది."

"నీ మాటలు నన్ను బాధపెడుతున్నాయి. నైరాశ్యం నీ మనసును ఆక్రమించింది. దానికి మందు కృపా రాక. ఈ లోకంలో ఏదీ జరగకూడదని లేదు; జరగాలనీ లేదు. జీవితం ఒక జూదం."

"తత్త్వం మాట్లాడుతున్నావు. నీలోనూ మార్పు వచ్చినట్టుంది. వైరాగ్యం రాకూడని వేళ నీలో ప్రవేశించినట్టుంది. దాన్ని పిచ్చికుక్కను తోలినట్టు తోలెయ్యి."

ఇరవై ఛాయాచిత్రాలు కవర్లో నుంచీ తీసి ఒక్కొక్కటీ ఆమెకు అందించాడు ప్రతిసారీ ఆమె ముఖంవైపు చూస్తూ. ఆమె మెచ్చుకోలుగా తల ఊపుతూ వచ్చింది. నిజంగా అది మెచ్చుకోలా లోపల అగ్నిపర్వతం రగులుతుంటే పైకి నటనా

అనుకున్నాడు. అసూయను ఆమె జయించుంటుంటుందని అతను అనుకోడంలేదు. అసూయ పడినా అనంతానికి నష్టం లేదు.

"నీకు బాధ కలగడం లేదూ?"

"నువ్వు పెళ్లాడబోతుంటే నాకు బాధ ఎందుకూ. అసూయ మాత్రం నిజానికి ఉండాలి. ఎందుకో అది కలగడం లేదు; నాకే ఆశ్చర్యం వేస్తోంది. నా మనస్తత్వంతో పెనుమార్పు నా ప్రమేయం లేకుండా కలిగినట్టుంది. ఇంతకాలం కలిసి గుట్టుగానైనా గడిపాము. మనది కేవలం శరీరాల కలయిక అయినపుడు వియోగంలో కష్టం ఉండదు."

"నీవు దైన్యంలో మునిగి తేలుతున్నపుడు నిన్ను ఒంటరిని చేసిపోతున్నా కదా. బాధను అణచుకుని మాట్లాడుతున్నట్టున్నావు."

"నీవు అందగాడివి మాత్రమే కాదు. తెలివైనవాడివి. మంచి మాటకారివి. ఎంత మధురంగా మాట్లాడగలవు! నీలో, నీతో జీవించడానికి ఉండవలసిన లక్షణాలన్నీ ఉన్నాయి. నా ఈ దుస్థితికి నీ ప్రమేయం లేదు, అనంతం. ఎలాంటి అపరాధభావానికీ నీలో చోటివ్వకు. నేను మనస్పూర్తిగా అంటున్నా. ఎంత చక్కటి స్త్రీని నీ భార్యగా ఎన్నుకున్నావు! రతీదేవిలా ఉంది. ఆమెను నపుంసకుడుకూడా అభిలషిస్తాడు. అందంలో ఆమె కాలిగోటికి పోలను. నీవు ఆమె కాలిగోటిని కూడా వదలవు. నాలా కాక ఆమె సుగుణాల రాశి కూడా  అయ్యుండాలి. బంగారానికి తావి కూడా అమరి నిన్ను చేరింది. నాది స్త్రీ మాట్లాడే భాషలా లేదు అని నాకు తెలుసు."

"నీ విలువ నీదే ఆమె విలువ ఆమెదే. నేను మాత్రం పోల్చి తీర్పు ఇవ్వలేను. నీలా ఆమె ధనవంతురాలని చెప్పగలను."

"నీవు సుడి కలవాడివి. మన సంబంధం ఆమెకు ఎప్పటికీ నీ ద్వారా తెలియదుకదా?"

"నీ సహృదయం ఆ విషయం నా ద్వారా కానీ మరొకరి ద్వారా కానీ ఆమెకు తెలియకూడదని కోరుకుంటుందని నాకు తెలుసు, సుమతి డియర్," భయంతో గొంతు కాస్త ప్రకంపిస్తూ అన్నాడు.

ప్రస్తుతం ఉన్న ఉన్మాద మనస్తత్వంతో ఆ పిల్ల దగ్గిరికి వెళ్లి ఆ విషయం తెలియపరుస్తుందేమోనని. ఇలాంటి పిచ్చి ప్రశ్న వేసిందేమిటి? మరో నిమిషంలో నేనూ ఆమెలా అయి ఈ శుభలేఖలు చింపెయ్యను కదా అనుకున్నాడు.

"నేను ఆమె చెవిలో ఈ విషయం ఊదుతానేమోనని భయపడటంలేదు కదా?"

"నువ్వు వెంటనే తయారవు. నిన్ను ఆమె దగ్గిరికి తీసుకెడతా. ఆమెను చూడవచ్చు, మాట్లాడవచ్చు."

"ఒద్దులే. ఉన్మాద మనస్తత్వంతో నేను ఏమి చేస్తానో నాకే తెలియకుండా వుంది."

**(కొనసాగింపు వచ్చే నెలలో)**

COMMENTS